# వేణుగోపాలుడిగా.. గోవర్ధన గిరిధారిగా..

- వైభవంగా కొనసాగుతున్న అధ్యయనోత్సవాలు
- భక్తజన సంద్రంగా యాదగిరిగుట్ట

శ్లో: 'మంగళం నరసింహాయ
మంగళం గుణసింధవే'
'మంగళానాం నివాసాయ
యాదాద్రీశాయ మంగళమ్'

యాదగిరిగుట్ట, డిసెంబర్ 24 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ప్రధానాలయంలో ఆళ్వార్ దివ్య ప్రబంధ అధ్యయనోత్సవాలు శాస్త్రోక్తంగా కొనసాగుతున్నాయి. వైకుంఠ(ముక్కోటి) ఏకాదశి రోజున ప్రారంభమైన అధ్యయనోత్సవాలు ఆదివారం రెండోరోజుకు చేరాయి. ఇందులో భాగంగా స్వామి వారికి ప్రభాత వేళ తిరుప్పావై మహోత్సవం, నవ కలశాభిషేకం, మూలమంత్ర హోమం చేశారు. ఉదయం స్వామిని వేణుగోపాలుడిగా అలంకరించి పురప్పాట్ సేవలు చేపట్టి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, పండితులు, రుత్వికులు ప్రత్యేకంగా పాశురాలను పఠించారు. సెలవు దినం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.



ఉదయం వేణుగోపాల స్వామి అలంకారంలో లక్ష్మీనరసింహుడు



సాయంత్రం గోవర్ధనగిరిధారి అలంకారంలో లక్ష్మీనరసింహుడు

## ఉదయం వేణుగోపాల స్వామిగా..

యాదగిరిగుట్ట ప్రధానాలయంలో రెండోరోజు అధ్యయనోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఉదయం పారాయణికులచే దివ్య ప్రబంధ పారాయణాలు నిర్వహించారు. అనంతరం స్వామిని వేణుగోపాల స్వామి అలంకారంలో భక్తులకు దర్శనార్థం ప్రధానాలయ తిరు మాఢవీధుల్లో ఊరేగించారు. పశ్చిమ సప్తతల రాజగోపురం మీదుగా తిరుమాఢ వీధుల్లోకి సేవ సాగుతూ ఉత్తర ద్వారం గుండా ఆలయంలోకి ప్రవేశింపజేశారు.

అలంకార విశిష్టత : భగవంతుడి లీలా వైభవాలు అనంతం. స్వామి వారు శ్రీకృష్ణుడిగా అవతరించి వేణుగోపాల స్వామిగా బృందావనంలో ఆబాల గోపాలాలను అలరించిన తీరు ఎంతో మనోహరంగా చెప్పుకోవచ్చని ఆలయ ప్రధానార్చకుడు నల్లన్‌థీఘళ్ లక్ష్మీనరసింహాచార్యులు తెలిపారు. భగవానుడు స్వయంగా సర్వవేద సారభూతమైన ప్రణవనాదాలను వేణువు ద్వారా వినిపిస్తూ దేవ, ఋషి, మానవ, పశు పక్ష్యాది సమస్త జీవరాశిని మోహింప చేసి వారిని ఉద్ధరించేదే ఈ వేణుగోపాలుడి లీల అని కొనియాడారు. ప్రకృతిలో అందరూ తన వారేనని, వారికి కలిగిన దుఃఖాలను తొలగించుటే తన అవతార ప్రయోజనమని స్వామివారు వేణుగోపాల స్వామి అలంకార సేవలో భక్తులకు దర్శనభాగ్యం కల్పిస్తున్నాడని ప్రధానార్చకులు తెలిపారు.

## సాయంత్రం గోవర్ధన గిరిధారిగా..

గుట్ట ప్రధానాలయంలో నిత్యారాధనల అనంతరం అధ్యయనోత్సవాల్లో భాగంగా సాయంత్రం స్వామి వారిని ద్రావిడ ప్రబంధ సేవ కాలాన్ని పారాణికులు, అర్చకులు ఘనంగా నిర్వహించారు. స్వామిని గోవర్ధన గిరిధారిగా అలంకరించి భక్తుల దర్శన భాగ్యం కల్పించారు. వేడుకల్లో ప్రభుత్వ విప్ ఎ.లక్ష్మణ్‌కుమార్, ఈఓ రామకృష్ణారావు, అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఆలయ ప్రధానార్చకులు నల్లన్‌థీఘళ్ లక్ష్మీనరసింహాచార్యులు, కాండూరి వేంకటాచార్యులు, డీఈఓ దోర్భల భాస్కర్‌శర్మ, ఏఈఓ రఘు, అర్చకులు, పారాయణదారులు, వేద పండితులు పాల్గొన్నారు.

## అలంకార విశిష్టత

శ్రీకృష్ణుడి బాల్య లీలలన్నీ అద్భుతమే. గోవర్ధన గిరిధారిగా ఇంద్రుడి గర్వాన్ని అణచి, సమస్త ప్రాణాలను రక్షించిన తీరు ఈ అలంకార సేవలో దర్శనమిస్తాయని ఆలయ ప్రధానార్చకుడు నల్లన్‌థీఘళ్ లక్ష్మీనరసింహాచార్యులు తెలిపారు. ఒకానొక సమయంలో నందుడు వంటి యాదవ ప్రముఖులు ఇంద్రయాగం చేసేందుకు సిద్ధపడ్డారు. ఇంద్రయాగం చేసిన ఇంద్రుడు సంప్రీతుడై వర్షాన్ని కురిపించాలని భావించి యాగానికి అవసరమైన సంబరాలను సేకరించారు. శ్రీకృష్ణుడు వారిని వారించుచూ అందుకు బదులుగా బృందానం, వన భూములు, పచ్చిక భూములకు నిలయమై, గోవుకు ప్రాణాధారమైన గోవర్ధన పర్వతాన్ని పూజించాలని చెప్పాడు. దీంతో యాదవ ప్రముఖులు శ్రీకృష్ణుడి ఆదేశానుసారం గోవర్ధన గిరి పూజను ప్రారంభించారు. కోపగించిన ఇంద్రుడు గోకులాన్ని సర్వనాశం చేసేందుకు సంవర్తక మేఘాలతో కుంభవృష్టి వర్షాన్ని కురిపించాడు. గోపకులను, గోవులను రక్షించి ఇంద్రుడి గర్వాన్ని అణిచి వేసేందుకు శ్రీకృష్ణుడు గోవర్ధన పర్వతాన్ని అవలీలగా ఒంటి చేతిలో ఎత్తి ఏడు రోజులుగా ఉంచి వారికి రక్షించాడు. గర్వ భంగం కలిగిన ఇంద్రుడు శ్రీకృష్ణుడు సామాన్య బాలుడు కాదని సాక్షాత్తు శ్రీమన్నారాయణుడేనని శరుణు కోరగా మన్నించాడు. భగవానుని ఆశ్రిత జనరక్షణ ఈ అలంకార సేవలో దర్శించవచ్చునని ప్రధానార్చకులు వెల్లడించారు.

### క్యూలైన్లలో కిక్కిరిసిన భక్తులు

యాదగిరిగుట్ట ఆలయం భక్తజనులతో కిక్కిరిసింది. మాఢ వీధులు, ప్రసాద విక్రయశాల, క్యూ కాంప్లెక్స్, క్యూలైన్లు సందు లేకుండా మారాయి. భక్తులు గంటల కొద్ది క్యూలైన్లలో నిలుచుని స్వామి వారిని దర్శించుకున్నారు. తెల్లవారుజాము నుంచి రాత్రి వరకు స్వామి వారి దర్శనాలు కొనసాగాయి. స్వామి, అమ్మవార్ల నిత్యోత్సవాలు ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున సుప్రభాత సేవ, తిరువారాధన, సహస్రనామార్చనలు చేశారు. ఆలయ ముఖ మండపంలో పలు ధపాలుగా సువర్ణ పుష్పార్చనలు నిర్వహించారు. సాయంత్రం ఆలయ ముఖ మండపంలో సువర్ణమూర్తులకు దర్బార్ సేవ నిర్వహించారు. ధనుర్మాసోత్సవాల్లో భాగంగా అమ్మవారికి తిరుప్పావై పూజలు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. అన్ని విభాగాలు కలుపుకొని స్వామి వారి ఖజానాకు రూ. 56,65,442 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ రామకృష్ణారావు, అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి తెలిపారు.



క్యూలైన్‌లో భక్తుల సందడి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి

# ఎన్నికల్లో గెలుపోటములు సహజం

- కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలి
- మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి

చండూరు, డిసెంబర్ 24 : ఎన్నికల్లో గెలుపోటములు సహజమని, నైతిక విలువలకు కట్టుబడి ఉండాలని మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు పాల్వాయి స్రవంతిరెడ్డితో కలిసి చండూరులో ఆదివారం నిర్వహించిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికార కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. కొత్త ప్రభుత్వానికి కొంత సమయం ఇద్దామని, హామీలు నెరవేర్చకపోతే నిలదీద్దామని, అందుకు కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని సూచించారు. గత ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపిస్తే రూ.572 కోట్ల అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. 2018లో గెలిచిన రాజగోపాల్‌రెడ్డి అధికారం లేకపోవడం వల్ల పనులు చేయలేకపోయానని సాకులు చెప్పారని, ఇప్పుడు నియోజకవర్గాన్ని ఏ మేరకు అభివృద్ధి చేస్తాడో చూద్దామని పేర్కొన్నారు. ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి ఈ ప్రాంత ప్రాజెక్టులను పూర్తి చేయించాలని సూచించారు. బీఆర్ఎస్ కార్యకర్తలు సంయమనంతో పని చేయాలని, స్థానిక సంస్థలు, పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ గెలుపునకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ తోకల చంద్రకళ, జడ్పీటీసీ కర్నాటి వెంకటేశం, బీఆర్ఎస్ చండూరు, గట్టుప్పల్ మండలాల అధ్యక్షులు బొమ్మరబోయిన వెంకన్న, ఇడెం కైలాసం, పట్టణ అధ్యక్షుడు భూతరాజు దశరథ, బీఆర్ఎస్‌కేవీ జిల్లా అధ్యక్షుడు గుర్రం వెంకట్‌రెడ్డి, కౌన్సిలర్లు, సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు

# సామాజిక చరిత్రను భవిష్యత్ తరాలకు అందజేసేవే కథలు

- సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ



దురస్తు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ, కవులు, రచయితలు

రామగిరి, డిసెంబర్ 24 : సామాజిక చరిత్రను భవిష్యత్ తరాలకు అందజేసేవే కథలు అని సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ అన్నారు. నల్లగొండ కథ పాఠశాల ఆధ్వర్యంలో ప్రచురించిన తెలంగాణ కథా సంకలనం 'దురస్తు' పుస్తకావిష్కరణకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కవులు, రచయితలతో కలిసి పుస్తకావిష్కరణ చేసి మాట్లాడారు. తెలంగాణ కథా రచయితలు ఆత్మగౌరవంతో తమ కథలను ప్రకటిస్తుండడం హర్షణీయమన్నారు. ప్రముఖ కవి మేరెడ్డి యాదగిరిరెడ్డి మాట్లాడుతూ తెలుగు కథకు పుట్టినిల్లు నల్లగొండ అని, ఈ నేలపై తెలుగు కథ గొప్పగా వికసించిందని పేర్కొన్నారు. తెలంగాణ నేల నుంచి ఎన్నో గొప్ప కథలు వచ్చాయని డాక్టర్ సుంకిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు. డాక్టర్ పగడాల నాగేందర్ మాట్లాడుతూ దశాబ్ద కాలంగా తెలంగాణ కథను తమ సంపాదకత్వంలో వెలుగులోకి తెస్తున్న సంగిశెట్టి శ్రీనివాస్, వెల్దండి శ్రీధర్‌ను అభినందించారు. నల్లగొండ కథ పాఠశాల ఇంతటి గొప్ప ఆవిష్కరణలు చేయడం అభినందనీయమన్నారు. కవి, రచయిత సంగిశెట్టి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నల్లగొండ కథ పాఠశాల నిర్వాహకులు పెరుమళ్ల ఆనంద్, డాక్టర్ సాగర్ల సత్తయ్య, డాక్టర్ బెల్లి యాదయ్య, భూతం ముత్యాలు, ఉప్పల పద్మ, మునాస్ వెంకట్, అంబటి వెంకన్న, తండు కృష్ణకౌండిన్య, విశ్రాంత ఐఏఎస్ చొల్లేటి ప్రభాకర్ పాల్గొన్నారు.

# నాగార్జునసాగర్‌లో పర్యాటకుల సందడి

నందికొండ, డిసెంబర్ 24: ప్రపంచ పర్యాటక ప్రాంతమైన నందికొండలో పండుగ సెలువు దినం కావడంతో ఆదివారం పర్యాటకులతో సందడి నెలకొన్నది. తెలంగాణ టూరిజం కృష్ణా నదిలో ఏర్పాటు చేసిన జాలిట్రిప్పుకు పర్యాటకులు ఆసక్తి చూపారు. నల్లమల్ల అడువుల సహజ అందాల మధ్య లాంచీ ప్రయాణం బాగుందని పర్యాటకులు తెలిపారు. నదీ తీరంలో పర్యాటకులు సెల్ఫీలు దిగుతూ, లాంచీస్టేషన్ పరిసరాలలో పర్యాటకులు భోజనాలు చేస్తూ సరదాగ గడిపారు. పర్యాటకులతో లాంచీ స్టేషన్, బుద్ధవనం, డ్యాం పరిసరాలు కిటకిటలాడాయి.



నాగార్జునకొండకు లాంచీలో వెళ్తున్న పర్యాటకులు